

కథా కౌముది

# అంతఃకరణం

యశస్వి జవ్వాది

పెళ్లి హంగులు దిద్దుకుంటున్న ఇంటిముందు కారాగింది.

కారును చూసిన గోపాలకృష్ణ, "ఏమేవ్..!! అమ్మాయ్ వచ్చింది" అంటూ కారు వద్దకు చేరుకున్నాడు.

ఆ కేకతో వచ్చిన పనోళ్లు కారునుండి సామాన్లు తీసుకుని లోపలకు వెళ్లారు. గోపాలకృష్ణ కూతురు గీతతో మాట్లాడుతూ లోనికి తీసుకొని వచ్చాడు. ప్రయాణంతో అలసిపోయిందని కూతుర్ని విశ్రాంతి తీసుకోమని బయటకు వెళ్ళాడు.

అదే సమయంలో అతని భార్య, గీత తల్లి,, సరస్వతి వచ్చి, "అమ్మా గీతా..!!!" అంటూ చేతిలో ఉప్పుని గీత మొహం చుట్టూ తిప్పబోయింది. కానీ, గీత మొహం చూసి హుషారు తగ్గిన గొంతుతో, "ఏమైందమ్మా!! అలా చిక్కిపోయావు. పెళ్లి కళంతా ఎటుపోయింది? ఆరోగ్యమేమైనా బాలేదా?" అనడిగింది.

గీత నీరసించిన గొంతుతో, "అదేం లేదమ్మా,, నెలరోజులు సెలవుల్లో వుంటాను కదా. అందుకే ఆ నెలరోజుల పని ఈవారం రోజుల్లోనే చేయించారు. పెళ్లి టైంకి నీ ఫేవరెట్ హీరోయిన్ సావిత్రిలా మారిపోతా చూడు....." అని నవ్వుతూ తల్లి గుండెలను చేరింది.

సరస్వతి భుజానికి గీత శ్వాస వెచ్చగా, వేగంతో తగిలింది.

ఆమె దానిని గమనించి వెనుకనుండి గీత వీపుమీద చెయ్యేసి, "గీతా!! ఏమైందిరా? పెళ్ళని బెంగపెట్టుకున్నావా?" అనడిగింది.

తల్లి చెయ్యి ఆప్యాయంగా తగలగానే గీత మనసు లోతుల్లో ఉన్న పుట్టెడు దుఃఖం ఒక్కసారిగా ఉబికి వచ్చింది. కళ్ళవెనుక వడిసి పట్టుకునే అవకాశం లేక, తల్లి భుజాలను తడిపింది.

సరస్వతి వీపుమీద నుండి చేతిని తీసి గీతను కళ్ళ ముందుకు తీసుకుని, “నన్ను చిన్నపిల్లా, చిన్నపిల్లా అనొద్దంటావూ ఇప్పుడేమో చిన్నపిల్లలా ఏడుస్తున్నావు?” అని చిరుకోపంతో కన్నీళ్లు తన పైట కొంగుతో తుడుస్తూ అంది.

గీత స్థిమితమై మంచం మీద కూర్చుంది.

అంతలో కిందనుండి గోపాలకృష్ణ, “ఇది నీ పెళ్లి కాదు, మీ అమ్మాయి పెళ్లి, పనులన్నీ నువ్వే చేయాలి త్వరగా రా కిందకి.....” అంటూ గట్టిగా అరిచినట్టు పిలిచాడు.

తండ్రి మాటలకు చిన్నగా నవ్విన గీత మొహం చూసి, “ఇలాగే నవ్వుతూ ఉండాలి సరేనా? పెళ్ళివారు సమయానికి వచ్చినా పెళ్ళికొడుకు నీతో ఏదో మాట్లాడాలట, రేపు వస్తున్నాడు. నువు ఉదయం పెందలాడే సిద్ధంగా ఉండు.. సరే సరే నేను త్వరగా వెళ్ళకపోతే మీ నాన్న అన్నంత పనీ చేస్తాడు....” అని నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

తల్లి గడప దాటగానే గీత మనసులో దుఃఖం మరలా కళ్ళను చేరింది. ఫోన్ లాక్ తీసి, సూర్యకు ఫోన్ చెయ్యాలా వద్దాని ఆలోచిస్తూ ఉంటే, అతని నుండే ఓ మెసేజ్ వచ్చింది. దానిని చూడటం ఇష్టంలేక నోటిఫికేషన్ బార్ నుండి తొలగించింది.

స్నానం చేసి ప్రయాణ బడలిక తీర్చుకోవడానికి నడుం వాల్చింది. ఆలోచనల మధ్య సతమతమవుతున్న బుర్రకు ప్రశాంతత దొరకగానే నిద్రమత్తులోకి జారుకుంది.

సమయం వేగంగా గడిచి, రాత్రి తొమ్మిది దాటింది. గోపాలకృష్ణ పెళ్లి పనుల హడావిడిలో ఉన్నాడు.

పెళ్ళిపనుల హడావుడిలో ఉన్న సరస్వతి సమయం చూసుకొని వచ్చి గీతను నిద్రలేపి, “ఎల్లుండి నుండి బంధువులు ఒక్కొక్కరు చేరుకుంటారు. ఇల్లంతా కోలాహలంగా ఉంటుంది. ఈ రెండురోజులు హాయిగా టైముకి అన్నం తిని నిద్రపో....” అని భోజనం టేబుల్ మీద పెట్టి వెళ్ళిపోయింది.

గీత వెంటనే భోజనం పళ్ళెం తీసుకుని గబగబా తినేసి, చేతిలోకి ఫోన్ తీసుకుంది. సూర్యా నుండి మూడు కాల్స్, ఆరు మెసేజులు వచ్చాయి.

శ్వాస గట్టిగా పీల్చుకుని అతనికి, ‘రేపు మిమ్మల్ని మీట్ అవ్వాలి. మీతో కొంచెం పర్సనల్‌గా మాట్లాడాలి’ అని సందేశం పంపింది.

వెంటనే బ్లూ టిక్ వచ్చింది. అతని సమాధానం కోసం చూసింది.

సూర్య, ‘ఇంటి దగ్గర కలుద్దామా? బయటనా?’ అనడిగాడు.

గీత ఒక్కక్షణం ఆలోచించి, ‘బయటనే....’ అని పంపింది.

‘ఐతే!! శివాలయం వద్ద కలుద్దామా?’

‘సరే!! రేపుదయం ఏడున్నరకు కలుద్దాము. మనం కలిసే విషయం సీక్రెట్‌గా ఉండాలి’ అని మెసేజ్ పంపి ఫోన్ డేటా ఆపేసి పక్కన పెట్టేసింది.

కళ్ళు మూసుకుంది. కంటి రెప్పలు భారంగా ఉన్నా నిద్రపట్టడం లేదు. పల్లానికి నీళ్లు పోయినట్టుగా ఆమె కంటినుండి కారుతున్న కన్నీళ్లు అంచున చేరి జారి దుప్పటిని తాకుతున్నాయి. ఆమె నిశ్శబ్దపు రోదన, నిస్సత్తువైన శరీరాన్ని మరింత బలహీనం చేసింది.

☆☆☆

తెల్లవారింది.

ఉదయాన్నే సిద్ధమైన గీత తల్లికి గుడికెళ్ళొస్తానని చెప్పి, స్కూటీ తీసుకుని గుడిని చేరింది. నేరుగా మెట్లెక్కి మంటపం వైపుగా నడిచింది. అప్పటికే చేరిన సూర్య, గీతను గుర్తుపట్టి దగ్గరకెళ్లాడు. కాంతి విహీనంగా ఉన్న గీత మొహం చూడగానే సూర్య మనసు కీడు శంకించింది.

పైకి నవ్వుతూ నేరుగా, “ఏదో మాట్లాడాలన్నావు?” అనడిగాడు.

సూర్య మొహంలో మార్పును గమనించిన గీత తెచ్చిపెట్టుకున్న నవ్వుతో, “దేవుడి దర్శనం చేసుకొచ్చి మాట్లాడతాను సూర్యా...” అంటూ అతనితో కలసి దర్శనం చేసుకుని పడమటి వైపు గాలిగోపురం కింద కూర్చున్నారు.

గీత ఏం చెప్పబోతుందాని చూపు తిప్పుకోకుండా ఆమెనే చూసాడు. గీత మాత్రం తన కళ్ళను అతని చూపుకు చిక్కకుండా జాగ్రత్తపడుతూ కూర్చుంది.

గీత మౌనంగా ఉండటంతో సూర్యానే, “గీతా ఈ పెళ్లి నీకు......” అని ఆపేసాడు.

గీత సమయం వచ్చిందనుకుని, “తప్పు చేయడం చాలా సులభం. కానీ, తప్పు చేశామనే భారంతో జీవితాంతం గడపటం చాలా కష్టం. అలాంటి భారం మోసేంత ధైర్యం, శక్తి నాకు లేవు. వందలకొద్దీ సంతోషమైన రోజులు గడిపినా, ఒక్కక్షణం చాలు ఆ రోజులు కాలగర్భంలో కలిసి పోవడానికి” అంది.

గీత మాటలు సూర్యాని ఇబ్బందికి గురిచేసాయి. అతనికెలా స్పందించాలో అర్థం కాలేదు. ఆమె చెప్పే మాటలు పూర్తిగా విని అప్పుడు మాట్లాడాలని నిర్ణయం తీసుకుని మౌనంగా ఉన్నాడు.

గీత కొనసాగిస్తూ, “సూర్యా.., నువ్వు నాకు సహాయం చేస్తావనో లేదా నామీద జాలి చూపిస్తావనో ఈ విషయం నీకు చెప్పడం లేదు. నేను నిన్ను మోసం చేసి పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక చెబుతున్నాను. నేను బెంగుళూరులో ఆదిత్యా అనే అబ్బాయిని లవ్ చేసాను. అతని తల్లిదండ్రులకు కూడా మా విషయం తెలుసు. వాళ్లే వచ్చి అమ్మవాళ్ళతో ఈ విషయం మాట్లాడతారని చెప్పారు. కానీ ఈలోపు.....” అని మరింత భారంగా మారిన గొంతుని సవరించుకుని, “కానీ ఈలోపే ఆదిత్యా బైక్ యాక్సిడెంట్‌లో చనిపోయాడు. ఆదిత్య తల్లితండ్రులు అన్నీ వదులుకుని యూయస్ వెళ్లిపోయారు”

అని తలదించుకుని రెండు చేతులతో అప్రయత్నంగా వచ్చిన కన్నీటిని తుడుచుకుని, “ఆదిత్యా చనిపోయే సమయానికే నాకు సెకెండ్ మంత్ రన్నింగ్. ఆదిత్యా గుర్తుగా వాడ్ని పెంచి పెద్దచేసి ఈ సమాజంలోకి వదిలితే పరిస్థితి ఎలా ఉంటుందో నాకు తెలుసు. పెళ్లికాని నాకు పుట్టిన బిడ్డను హీనంగా, నీచంగా చూస్తారు. ఒక తల్లిగా నాకింతకన్నా ఘోరమైన అవమానం మరొకటుండదు. నా బిడ్డను గేలిచేస్తూ ఉంటే వాడ్ని పెంచడం నా వల్లకాదు. అందుకే ఆదిత్యా నాకిచ్చిన విలువైన బహుమతిని కాదనుకున్నాను. ఒక బ్రోకర్ సహాయంతో అబార్షన్ చేయించుకున్నాను. ఈ విషయం దాచి నిన్ను పెళ్లి చేసుకోవడం నాకిష్టం లేదు. అలాగని నిన్ను నామీద జాలిపడి పెళ్లి చేసుకోమని అడగడం లేదు. నువ్వే ఏదొక కారణం చెప్పి ఈ పెళ్లి ఆపుతావని నీ సహాయం అడుగుతున్నాను” అంటూ దించిన తలెత్తి సూర్య మొహం చూడబోయింది.

అప్పటికే సూర్య లేచి నిలబడ్డాడు. గీత, సూర్య ఎలా స్పందిస్తాడో అర్థంకాక అలానే కూర్చుని అతని పాదాల వంక చూసింది.

కొన్నిక్షణాలకు సూర్యా పాదాలు దూరంగా వెళ్ళాక, తలెత్తి గర్భాలయం వైపు చూస్తూ, ‘స్వామీ!! అమ్మానాన్నలను ఓదార్చే మనోనిబ్బరం నాకు ప్రసాదించు’ అనుకుని కళ్ళను తుడుచుకుని స్కూటీ మీద ఇల్లు చేరింది.

☆☆☆

గీతను చూసిన గోపాలకృష్ణ, “దర్శనం బాగా అయ్యిందా తల్లీ!! ప్రసాదం టేబుల్ మీద పెట్టు, స్నానం చేసొచ్చి తీసుకుంటాను” అన్నాడు.

గీత తలాడించి లోపలకు వెళ్ళింది. ఆరోజు మధ్యాహ్నం వరకూ సూర్యా సమాధానం కోసం చూసింది. అతని నుండి స్పందన లేదు. సాయంత్రంలోగా సూర్యా నుండి కాల్ రాకపోతే తానే మరొక నెపంతో పెళ్లిని ఆపాలనుకుంది.

సాయంత్రమైంది. ఇక లాభం లేదనుకుని గదిలో నుండి బయటకు వెళ్లి, హాల్లో చూసింది. గోపాలకృష్ణ, సరస్వతి కూర్చుని పెళ్లి విషయాలు చర్చించుకోసాగారు. ఇదే సరైన సమయనుకుని వేగంగా మెట్లు దిగింది. సరిగ్గా వాళ్ల పక్కన కూర్చునే సరికి, గోపాలకృష్ణ తమ్ముడు కుటుంబంతో సహా వచ్చాడు. మరో అవకాశం లేక వాళ్ళని స్వాగతించి నవ్వుతూ పలకరిస్తూ కాసేపు మాట్లాడి గదిని చేరింది.

తలంతా భారంగా అనిపించిన గీత, టాబ్లెట్ కోసం బ్యాగులో వెతికింది. చేతికి ఒక ఫోటో తగలగానే, బయటకు తీసి చూసింది. అది ఆదిత్య ఫోటో. దాన్ని చూడగానే మనసులో, ‘నే తీసుకున్న నిర్ణయం ఎన్నడూ తప్పు కాదనే నమ్మకం నాకుంది ఆదిత్యా, నీ విషయంలో కూడా నేను తప్పు చేయలేదు. అందుకే ఈ విషయాన్ని తప్పుగా దాచి ఈ పెళ్లి చేసుకుని మరొక పెద్దతప్పు చేయలేను’ అని ఫోటోను మరింత లోపలకు పెట్టింది.

దూరంగా ఫోన్ నోటిఫికేషన్ బార్ వెలుగుతూ కనిపించింది. అది సూర్యా నుండి వచ్చిన సందేశం, వెంటనే లాక్ తీసి చూసింది.

సూర్యా, 'నా గురించి నీకేమి తెలియదని అర్థమైంది. ముందు నువ్వు నా గురించి తెలుసుకో....' అని పంపాడు.

సూర్యా అలా ఎందుకు పంపాడో అర్థం కాని గీత, ఆలోచిస్తూ తన తండ్రి పంపిన మ్యాట్రిమోనియల్ లింక్ తెరచి సూర్యా వివరాలు ఒక్కోటి చదివింది. దెబ్బకు గీత నోటమాట రాలేదు. తాను అబార్షన్ చేయించుకున్న ఆసుపత్రిలోనే సూర్యా డాక్టర్‌గా పనిచేస్తున్నాడని అర్థమైంది. ఒక్కక్షణం బుర్ర పని చేయలేదు. తన కళ్ళముందు ఆసుపత్రి దృశ్యాలు కదలాడాయి. మాస్క్ వెనుక తాను చూసిన డాక్టర్ కళ్ళను, సూర్యతో పోల్చుకుంది. ఆలోచనలన్నీ ఒక చోటకొచ్చి ఆగిపోయాయి. ఆమె మదిలో మరికొన్ని కొత్త ప్రశ్నలు మొలకెత్తాయి. వెంటనే సూర్యకు ఫోన్ చేయాలని డయల్ ప్యాడ్ మీదుగా చేతులను వేగంగా పోనిచ్చింది. ఈలోగా ఎవరో తలుపు కొట్టారు.

గీత భయం మరింత రెట్టింపైంది. ఫోన్ పక్కన పెట్టి, మొహం తుడుచుకుని తలుపులు తెరిచింది. ఎదురుగా సూర్యా ఉన్నాడు. ఆమెకు ఏం జరుగుతుందో అర్థం కాలేదు. అతని వెనుకనే ముసిముసి నవ్వులు నవ్వుతున్న బాబాయ్ కూతురుంది.

గీత ఆశ్చర్యంగా, "మీరేంటి ఇక్కడ?" అనడిగింది.

లోపలకొచ్చిన సూర్యా ఆమె పక్కన పెట్టిన ఫోన్ డయల్ ప్యాడ్‌లో తన నంబర్ చూసి, "నీతో నేరుగా మాట్లాడాలని వచ్చాను" అన్నాడు.

గీత అనుమానంగా చూసింది. తనని చూస్తుందేమోనని బాబాయ్ కూతురు అక్కడనుండి వెళ్ళిపోయింది. సూర్యా ఒక అడుగు వెనక్కి వేసి తలుపులు దగ్గరకు వేసాడు.

ఆమెవైపు చూస్తూ, "కంగారు పడకు, కింద అత్తయ్య వాళ్లకు వేరే విషయం చెప్పి వచ్చాను. కారణం ఏమైనా గానీ, అది గతం గీతా, ఇప్పుడు నువ్వెలా ఉన్నావన్నదే నాకు ముఖ్యం. నేను నిన్నే పెళ్లి చేసుకుంటాను. ఇది జాలితోనో లేదా మరేదో సింపతితోనో నేను చెప్పడం లేదు. నువ్వు అనవసరపు ఆలోచనలు పెట్టుకోకుండా సంతోషంగా ఉండు" అన్నాడు.

గీతకు సూర్య మనసు అర్థం కాక, "సూర్యా!! నువ్వు దీనికొప్పుకున్నా నేను ఒప్పుకోను. జీవితాంతం తప్పు చేసానన్న గిల్ట్‌తో బాధపడటం నాకిష్టం లేదు. నేను నీకు నచ్చడానికి కారణం ఏదైనా అయ్యుండచ్చు కానీ......" అని ఆందోళన నిండిన కళ్ళతో ఆగిపోయింది.

సూర్య, “గీతా నేను చెప్పేది పూర్తిగా విను. మన పెళ్లి చాలా వేగంగా కుదిరింది. అత్తయ్య వాళ్ళని దృష్టిలో పెట్టుకుని నువ్వు నాతో ముందు పెళ్లికొప్పుకున్నావు. ఇక్కడకు వచ్చాక అసలు నిజం చెప్పి పెళ్లి అపాలనుకున్నావు. ఇదొక్కటే నీలో నాకు నచ్చిందనుకుంటే నువ్వు పొరపాటు పడినట్టే.....” అని తన ఫోన్లోనున్న ఆదిత్యా ఫోటో బయటకు తీసి ఆమెకు చూపించాడు.

గీత కళ్లు పెద్దవి చేసి, “ఈ ఫోటో.....” అంది.

సూర్యా, “గీతా!! నీకు అబార్షన్ చేసింది నేనే, నీ ఫోటో నాకు అమ్మవాళ్ళు పంపగానే నాకు ఆశ్చర్యం, అసహ్యం రాలేదు. నేను చంపిన ప్రతీ శిశువు వెనుకాల రెండు కుటుంబాల పరువూ ప్రతిష్ఠలు మాత్రమే కాదు, ఎందరో ప్రాణాలు ముడిపడుకున్నాయని తెలుసు. అందుకే నేను ఈ పనులు చేసాను. నేను కాకపోతే మరొకడు ఈ పని చేస్తాడు. చేసినవాడు దీనిని అవకాశంగా వాడుకుని ఆడపిల్లలను ఇబ్బంది పెట్టె అవకాశం ఉంది. అందుకే జెన్యూన్ రీజన్‌తో వచ్చిన వాళ్ళకి మాత్రమే నేను సహాయం చేస్తున్నాను. అలాగే నీకు కూడా. మీరు తొందర పడ్డారు. కానీ దాన్ని సరిదిద్దుకోవడానికి ఆదిత్యా లేడు. మరొకమార్గం లేని సమయంలో ఈ కఠినమైన నిర్ణయం తీసుకున్నావు. అబార్షన్ ముందు నువ్వు ఆదిత్యా ఫోటో చూస్తూ పడిన వేదన నేను గమనించాను. నీ కన్నీళ్ల వెనుక ఆదిత్యా మీదున్న ప్రేమ అర్ధమైంది. అతని కోసం వాకబు చేసాను. అతను చనిపోయాడని తెలిసింది. పేపర్లో యాక్సిడెంట్ వార్తలో అతని ఫోటో చూసిన గుర్తు వచ్చింది. నువ్వు తీసుకున్న నిర్ణయమే సరైందని నాకనిపించింది. అందుకే నీకు అబార్షన్ చేసాను. ఎన్నో ప్రాణాలను తీసేసిన ఈ చేతికి ఓ మంచిపని చేసే అవకాశం వచ్చిందనుకుని మాత్రం నిన్ను పెళ్లి చేసుకోవడం లేదు. ఈ రోజుతో అది రెట్టింపయింది. నీ భవిష్యత్తు ఏమవుతుందో అనికూడా ఆలోచించకుండా నీ గురించి నిజం చెప్పిన నీ వ్యక్తిత్వం చూసి చేసుకుంటున్నాను. ఈకాలంలో ఈ ప్రేమలన్నీ సహజమై పోయాయి. నిజం చెప్పిన నిన్ను కాదని వేరొకరిని చేసుకోవాలనుకున్నా వాస్తవం చెప్తారనే నమ్మకం లేదు. డాక్టర్ చదివిన వాడిని నాకు వాస్తవ ప్రపంచం తెలియక కాదు. పెళ్లి వద్దన్న విషయం చెప్పి ఈ వయసులో అత్తయ్య వాళ్ళను క్షోభపెట్టకు. ఇప్పటికీ నీకు ఈ పెళ్లి ఇష్టం లేదంటే చెప్పు, నేరుగా వెళ్లి మీ వాళ్ళతో మాట్లాడతాను. నీ మెసేజ్ చూసి అందుకే నేను ముందుగా కలవడానికి వచ్చాను” అన్నాడు.

గీతకు సూర్య మనసు అర్ధమైంది. కళ్ళకు అడ్డుగా ఉన్న కన్నీళ్లను తుడుచుకుని సూర్యా మొహాన్ని మొదటిసారి స్పష్టంగా చూసింది. మొహం మీద చిన్నపాటి చిరునవ్వుతో ప్రశాంతంగా కనిపించాడు. అతని మాటల్లో నిజాయితీ తన కళ్ళలో ప్రస్ఫుటంగా కనిపించింది. తన తండ్రి ఒడిని చేరినంత పదిలంగా సూర్యా గుండెల మీద వాలి కృతజ్ఞతా భావంతో హత్తుకుంది. సూర్యా ఆమెకు నేనున్నాననే ధైర్యం ఇస్తూ చేతులతో చుట్టాడు.

COMMENTS